
nipuna
Every Wednesday Free Supplement
05.
4 సెప్టెంబర్ 2024
పేజీలు 8

### వికార శునకం

ప్రపంచంలోనే అత్యంత వికారమైన (అంద విహీనమైన) శునకంగా ఎనిమిదేండ్ల పెకింగీస్ వైల్డ్ థాంగ్ ఎంపికయ్యింది. అమెరికాలో కాలిఫోర్నియాలోని ఒక సంస్థ ఈ పోటీలను జూన్ 21న నిర్వహించింది. ఈ శునకం ఈ పోటీలో నాలుగుసార్లు పాల్గొన్నప్పటికీ విజయం సాధించలేదు. ఐదోసారి పాల్గొనగా విజేతగా నిలిచి 5 వేల డాలర్ల ప్రైజ్‌మనీని గెలుచుకుంది. రోమ్ అనే శునకం ద్వితీయ (3 వేల డాలర్లు), డైసీ మే అనే శునకం తృతీయ (2 వేల డాలర్లు) స్థానాల్లో నిలిచాయి. 1970 నుంచి ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

# భారత్ యూపీఐ - మలేషియా పేనెట్ బంధం

గ్రూప్-1 ప్రత్యేకం
జనరల్ ఎస్సే




- అంతర్జాతీయ సంబంధాల్లో ఇటీవల భారత్ ఒక విలక్షణ ధోరణిని చూపుతుంది. అవతలివారు కయ్యానికి కాలు దువ్వినా భారత్ సంయమనంతో వ్యవహరిస్తుంది. తగిన విధంగా సమాధానం అన్యాపదేశంగా ఇస్తూనే స్నేహహస్తాన్ని చాపుతుంది. ఘర్షణల స్థానంలో పరస్పరాభివృద్ధి, ప్రాంతీయ సామరస్య జీవనాన్ని ప్రోది చేస్తున్న ఈ నయా ధోరణిని భారత్ ఇప్పటికే చైనా, మాల్దీవ్స్ విషయాల్లో ఆచరణాత్మకంగా చూపింది. ఇదే కోవలో ప్రస్తుతం మలేషియాను సైతం మచ్చిక చేసుకుంటుంది.
- మలేషియాతో భారత్ దౌత్య సంబంధాలను 1957లో ఏర్పరచుకున్నప్పటికీ ఇరుదేశాల మధ్య రాకపోకలు, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. చోళరాజుల కాలం (9-13వ శతాబ్దం)లో చోళులు, మలేషియా ప్రాంతానికి సముద్ర వర్తక మార్గాలను అభివృద్ధి చేసి విస్తృతంగా వాణిజ్యం చేశారు. రాజ రాజ చోళుడు (1), రాజేంద్ర చోళుడు (1)ల కాలంలో ఆగ్నేయాసియా వరకు విస్తరించిన చోళ సామ్రాజ్యంలో మలేషియా కూడా ఉంది. అంతేకాక హిందూ మత గ్రంథాలు, దేవీ దేవతలు మలేషియాలో కూడా తమదైన రూపాంతరీకరణతో కనిపిస్తాయి.
- ఈ విధంగా చారిత్రక కాలం నుంచీ ఇరుదేశాలకు సత్సంబంధాలున్నప్పటికీ కొద్దిపాటి స్పర్థలూ ఉన్నాయి. భౌగోళిక వ్యూహాత్మకత, ప్రాంతీయ కలిమి దృష్ట్యా భారత్‌కు మలేషియాతో సత్సంబంధాలు అవసరం. అదేవిధంగా వేగంగా వృద్ధి చెందుతూ ప్రపంచ రాజకీయ, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న భారత్ ఆవశ్యకత మలేషియాకూ మరింత ఉంది. ఈ నేపథ్యంలో భారత్ చొరవతో వివాదాలను పక్కనపెట్టి భారత్-మలేషియా ఒక పరస్పర సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరలేపాయి.

**సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం**

- ఇటీవల మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం భారత పర్యటన సందర్భంగా ప్రధాని మోదీతో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. 2015 నుంచి ఇంతవరకు కొనసాగుతూ వచ్చిన 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థానంలో 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' ఇరుదేశాల సంబంధాల్లో ఏర్పడింది. (వ్యూహాత్మక భాగస్వామ్యం అంటే కొన్ని పరస్పర లబ్ధి ఉన్న అంశాల్లో ఒప్పందాలు చేసుకొని రెండు దేశాలు ఆ అంశాల మేరకు సహకరించుకోవడం. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అంటే పరస్పర సహకారాన్ని ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, రక్షణ తదితర కీలక రంగాలకు కూడా బహుముఖంగా విస్తరింపజేయడం). ఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒడంబడిక మేరకు మలేషియా ప్రధాని ప్రస్తుత పర్యటనలో 9 పరస్పర అవగాహన ఒప్పందాలతో పాటు అనేక అంశాల్లో ఇరు దేశాలూ ఒక తాటిపైకి వచ్చాయి. అవి..

1) **ఉద్యోగుల నియామకం, ఉపాధి, స్వదేశానికి తిప్పి పంపడంపై అవగాహన ఒప్పందం**

- ఇరుదేశాల మధ్య ఉపాధి వలసలు, సంబంధిత అంశాల నిర్వహణను క్రమబద్ధీకరించడానికి, అక్రమ వలసలు-శ్రమ దోపిడీ, మానవ అక్రమ రవాణాలను అడ్డుకోవడానికి ఈ ఒప్పందం సహకరిస్తుంది.

2) **ఆయుర్వేదం, సంప్రదాయ వైద్య విజ్ఞానం సంబంధిత అవగాహన ఒప్పందం**

- భారతీయ పురాతన వైద్యవిజ్ఞానాన్ని మలేషియాతో పంచుకోడానికి మలేషియాలోని టుంకు అబ్దుల్ రహ్మాన్ యూనివర్సిటీలో భారతదేశం ఒక ఆయుర్వేద విభాగాన్ని, మలయా యూనివర్సిటీలో తిరువళ్లువార్ శాఖను ఏర్పాటు చేయనుంది.

3) **డిజిటల్ టెక్నాలజీ రంగంలో సహకార ఒప్పందం**

- భారతదేశం డిజిటల్ లావాదేవీల పరంగా సాధించిన ప్రగతి, అవలంబిస్తున్న సాంకేతిక విధానాలకు సంబంధించిన విజ్ఞానాన్ని ఈ ఒప్పందం ద్వారా మలేషియాతో పంచుకోనుంది. అంతేకాక భారతదేశ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)'ను మలేషియాలోని డిజిటల్ పేమెంట్ సిస్టం అయిన 'పేనెట్'తో అనుసంధానించనున్నారు. తద్వారా ఇరుదేశాల మధ్య ఆర్థిక లావాదేవీలు మరింత సులువు కానున్నాయి.
- అంతేకాక క్వాంటం కంప్యూటరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి ఇతరత్రా డిజిటల్ సాంకేతిక రంగాల్లో కూడా ఈ ఒప్పందం ద్వారా ఇరుదేశాల మధ్య సహకారం ఏర్పడనుంది.

4) **పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గవర్నెన్స్‌లో సహకార ఒప్పందం**

- ఈ ఒప్పందం ద్వారా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, గవర్నెన్స్‌లలో ఇరుదేశాలు తీసుకువచ్చిన సంస్కరణలు, పాటిస్తున్న ఉత్తమ విధానాన్ని గురించి సమాచార పరస్పర బదిలీ ద్వారా సహకరించుకోవడం జరుగుతుంది.

5) **వ్యూహాత్మక బియ్యం ఎగుమతి ఒప్పందం**

- ఈ ఒప్పందం ద్వారా భారతదేశం మలేషియా ఆహార భద్రత కోసం రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఏకమొత్తంగా ఒకేసారి ఎగుమతి చేయడానికి అంగీకరించింది.

6) **విద్య, యువత, క్రీడల రంగంలో సహకారం**

- మలేషియా విద్యార్థుల కోసం భారతదేశంలో 100 సీట్లను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో అధ్యయనం కోసం 'భారత దేశ సాంకేతిక, ఆర్థిక సహకారం (ఐటీఈసీ)' కార్యక్రమం కింద కేటాయించింది. ఇదేవిధంగా ఇరుదేశాల యువత, క్రీడలు, విద్య రంగాల్లో సహకరించుకోనున్నాయి.

7) **రక్షణ, భద్రత రంగాల్లో సహకారం**

- ఇరుదేశాలు రక్షణ, భద్రతా రంగాల్లో సహకరించుకోడానికి సంయుక్త సైనిక విన్యాసాలను మరింత మెరుగుపరచుకోడానికి చర్చలు నిర్వహించారు. భారత్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తయారీ విమానాలను మలేషియాకు విక్రయించడానికి భద్రత, రక్షణ రంగాల్లో పరిశోధన, అభివృద్ధిలో సహకరించుకోవడంపై చర్చించారు. అంతేకాకుండా ఉగ్రవాద నిరోధక కార్యక్రమాల్లో పరస్పర సహకార ఆవశ్యకతను ప్రధాని మోదీ ప్రస్తావించారు.

8) **స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెంపునకు కృషి**

- భారత్-మలేషియా మధ్య స్థానిక కరెన్సీల్లో వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు 'భారత రిజర్వ్ బ్యాంక్', మలేషియా 'బ్యాంక్ నెగారా' మధ్య అనుసంధానతకు అంగీకారం కుదిరింది. ఇరువైపు వాణిజ్య వర్గాలను స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు జరుపుకునే విధంగా ప్రోత్సహించనున్నారు.

9) **ఆసియాన్-ఇండియా ట్రేడ్ ఇన్ గూడ్స్ అగ్రిమెంట్ (ఏఐటీఐజీఏ)**

- ఆసియాన్ (ఏఎస్ఈఏఎన్) కూటమి దేశాలకు-భారత్‌కు మధ్య గొలుసుకట్టు సరఫరా వ్యవస్థ (సప్లయ్ చైన్ కనెక్షన్)ను మెరుగుపరిచేందుకు ఏఐటీఐజీఏ సమీక్షను 2025 నాటికి పూర్తి చేసేందుకు రెండు దేశాలు సహకరించుకోనున్నాయి.

10) **వివిధ కూటముల్లో మలేషియా చేరికకు భారత్ మద్దతు**

- బ్రిక్స్ కూటమిలో చేరడానికి ఉత్సుకత చూపుతున్న మలేషియాకు భారత్ మద్దతు తెలిపింది. అదేవిధంగా ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్, ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్, కొలిషన్ ఫర్ డిజాస్టర్ రెసిలెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి భారతదేశ చొరవ, భాగస్వామ్యం గల కార్యక్రమాల్లో చేరేందుకు మలేషియా ఆసక్తి చూపుతుంది. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా కలిసి కృషి చేయడానికి నిర్ణయించాయి.
- భద్రతా మండలంలో శాశ్వత సభ్యత్వం కోసం భారతదేశం చేస్తున్న ప్రయత్నాలకు, ఐక్యరాజ్యసమితిలో ఇతరత్రా చొరవలకు మలేషియా మద్దతిచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. అదేవిధంగా 2025లో ఆసియాన్ కూటమి చైర్మన్‌షిప్‌ను దక్కించుకునేందుకు మలేషియా చేస్తున్న ప్రయత్నాలకు సైతం భారత్ మద్దతివ్వనుంది.

11) **పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం**

- ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు పెంపొందించుకునేందుకు, తమ మధ్యగల సమగ్ర ఆర్థిక సహకారం ఒప్పందం (కాంప్రహెన్సివ్ ఎకనామిక్ కోఆపరేషన్ అగ్రిమెంట్)ను సమీక్షించాలని నిర్ణయించాయి. తద్వారా సెమీ కండక్టర్స్, ఫిన్‌టెక్, శక్తి, రక్షణ రంగ ఉత్పత్తులు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీల పరంగా వాణిజ్యం, పెట్టుబడులు మరింత వేగం పుంజుకుంటాయి.

12) **సంస్కృతి, కళలు, వారసత్వం, పర్యాటక రంగాల పరస్పర ప్రోత్సాహం**

- సాంస్కృతిక మార్పిడి, వారసత్వ సంరక్షణ, కళల అభివృద్ధికి పరస్పరం తోడ్పడటంతో పాటు ఇరుదేశాల మధ్య పర్యాటకాన్ని పెంపొందించడం. ఈ కోవలో భారత్ 2026 సంవత్సరాన్ని 'విజిట్ మలేషియా ఇయర్'గా గుర్తించగా ఇరుదేశాలు తమ దేశాల మధ్యగల వీసా నిబంధనలను సరళతరం చేయడానికి సంకల్పించాయి. సుస్థిర పర్యాటకం దిశగా సమాలోచన చేస్తున్నాయి. ఇరుదేశాల మధ్య వాయురంగంలో అనుసంధానతలను పెంపొందించేందుకు విమానయాన సంస్థలను ప్రోత్సహించే దిశగా సమాయత్తమవుతున్నాయి.
- ఈ విధంగా అనేక రంగాలపరంగా పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకునేందుకు భవిష్యత్ కార్యాచరణను రచించాయి. భారత్-మలేషియా ఇప్పటికే ఒక స్థాయి మేరకు పరస్పర సంబంధాలను కలిగి ఉండటంతో పాటు కొన్ని పొరపొచ్చాలను కొనసాగిస్తున్నాయి. వీటిని సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

## భారత్-మలేషియా మధ్య సంబంధాలు

1) **ఆర్థిక సంబంధాలు**

- మలేషియా భారతదేశానికి 13వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. అదేవిధంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరంగా 1.18 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో 31వ అతిపెద్ద పెట్టుబడిదారుగా ఉంది. మలేషియాకు చెందిన 70 కంపెనీలు నిర్మాణం, ఇతరత్రా రంగాల్లో భారత్‌దేశంలో పనిచేస్తున్నాయి. అలాగే ఆసియాన్ కూటమిలో మలేషియా భారతదేశ మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. అదేవిధంగా భారతదేశం ఆగ్నేయాసియాలో మలేషియా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 19.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.
- భారతీయ కంపెనీలు ఇప్పటికే మలేషియాలోని తయారీ, ఐటీ, శక్తి రంగ సంస్థల్లో 2.62 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. అంతేకాక భారతదేశానికి చెందిన మూడు ప్రభుత్వ రంగ సంస్థలు, 61 జాయింట్ వెంచర్లు, 150 కంటే ఎక్కువ భారతీయ టెక్, సేవా రంగ కంపెనీలు మలేషియాలో పని చేస్తున్నాయి. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో చెల్లింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలకు తోడు రూపాయిల్లో కూడా జరిపేందుకు అంగీకారం ఉంది.

2) **ఎగుమతులు-దిగుమతులు**

- భారత్ నుంచి ప్రధానంగా ఖనిజ ఇంధనాలు, అల్యూమినియం, మాంసం, బియ్యం, ఇనుము, ఉక్కు, రాగి, రసాయనాలు, యంత్ర పరికరాలు మలేషియాకు ఎగుమతి అవుతున్నాయి.
- మలేషియా నుంచి భారత్ పెద్ద ఎత్తున పామాయిల్ దిగుమతులపై ఆధారపడి ఉంది. మలేషియాలో ఉత్పత్తి అవుతున్న పామాయిల్‌లో దాదాపు 20 శాతం వరకు భారత్ కొనుగోలు చేస్తూ ఆ దేశానికి అతిపెద్ద పామాయిల్ దిగుమతిదారుగా ఉంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పామాయిల్ ఉత్పత్తిదారు అయిన మలేషియాకు పామాయిల్ చాలా కీలకమైన రంగం. అదేవిధంగా తమ ఆహార అవసరాల కోసం మలేషియా భారత్ బియ్యం, మాంసంపై కూడా ఆధారపడుతుంది.
- భారత్ పామాయిల్‌తో పాటు కలప, బొగ్గు, ఖనిజ ఇంధనం, జంతు, కూరగాయలు కొవ్వులు, విద్యుత్ యంత్రాలను దిగుమతి చేసుకుంటుంది.

3) **భౌగోళిక - వ్యూహాత్మక - సైనిక సంబంధాలు**

- మలేషియాతో సుహృద్భావ సంబంధాలు భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఎంతో కీలకం. ఆసియాన్ ప్రాంతంతో భారత్‌కు అనుసంధానతను, ప్రాభవాన్ని ఏర్పరిచి గ్లోబల్ సౌత్ ప్రభావాన్ని పెంచేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు బలిమి చేకూరుస్తుంది.
- అదేవిధంగా భౌగోళిక వ్యూహాత్మక, ప్రాంతీయ భద్రత దృష్ట్యా, చైనా నుంచి ఇరుదేశాలకు ఎదురవుతున్న సవాళ్ల దృష్ట్యా ఇరుదేశాల మధ్య సహకారం, సత్సంబంధాలు అవసరం. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని నిలువరిండానికి తమ భౌగోళిక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మలేషియాకు భారత్ వంటి దేశాల మద్దతు అవసరం.

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్



మిగతా 6 పేజీలో